

ప్రజావాణి రద్దు

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఎలక్షన్ కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపి వేస్తున్నామని, కోడ్ ముగిసిన తర్వాత యథావిధిగా తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

కోలుకోని రైతన్న



పంట పొలాలను ముంచెత్తిన వరద (ఫైల్)

- గోదావరి వరద బీభత్సంతో వేల ఎకరాల్లో నష్టం
- అన్నదాతకు అందని పరిహారం
- సర్వేలకే పరిమితమైన ప్రభుత్వం
- సాయం అందితేనే యాసంగి సాగు

బాసర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గోదావరి వరద బీభత్సంతో నిర్మల్‌లో వేల ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులు కష్టాలు కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ చివరి వారాల్లో సంభవించిన రెండు భారీ వరదలకు చేతికందే దశలో ఉన్న ఖరీఫ్ పంట పూర్తిగా నీటమునిగి, రైతన్న ఆశలను గంగపాలు చేసింది. ఈ పెను నష్టం జరిగి దాదాపు 45 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం మాత్రం ఇంతవరకూ విడుదల కాలేదు.

● రూ.లక్షల్లో నష్టం..

నిర్మల్ జిల్లాలో వేలాది మంది రైతులు పండించిన వరి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలు వరదలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒక్కో రైతు విత్తనం, పురుగు మందులు, కలుపు నివారణ వంటి వాటి కోసం వేలకు వేలు ఖర్చు చేసి పెట్టుబడి పెట్టారు. కాని పంట పూర్తిగా రాని దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం. ఒక వైపు భూమి యజమానికి చెల్లించాల్సిన కౌలు డబ్బులు, మరో వైపు పంట పెట్టుబడి... ఇలా రెండు వైపుల నుంచి వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఒక్కొక్క రైతుకు లక్షల రూపాయల్లో నష్టం వాటిల్లినట్లు అంచనా. ప్రభుత్వ ఆసరా లేనిదే ఈ రైతులు కోలుకోవడం అసాధ్యమనే చెప్పాలి. గోదావరి పరివాహక మండలాలైన బాసర, లోకేశ్వరం, ముధోల్, దిలావర్‌పూర్ వంటి మండలాల్లో దాదాపు 40వేల ఎకరాలకు పైగా పంట నీట మునిగింది. సోయాబీన్, పత్తి, వరి భారీ స్థాయిలో దెబ్బతిన్నాయి. ఎక్కువ భాగం నీటమునిగి పోవడంతో అసలు కొంత మేరకు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. ఒకపక్క పంట నష్టపోవడం, మరో పక్క నష్టపోయిన పంటను తొలగించుకోవాలన్న ఖర్చుచేయాల్సిన దుస్థితి రైతుకు ఎదురైంది.

● సాయం ఎప్పుడు...?

వరదలు సంభవించిన వెంటనే, ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి, పంట నష్టవివరాలను నమోదు చేసింది. కింది స్థాయి అధికారులు మొదలుకొని రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధుల వరకు అందరూ రైతులకు తప్పకసాయం అందుతుందని హామీ ఇచ్చారు. అధికారులు కూడా సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి సమర్పించారు. అయితే హామీలు, నివేదిలకు ఇచ్చి నెల రోజులు గడిచిపోయినా రైతులకు అందాల్సిన ఆర్థిక సహాయం ఇప్పటికీ మంజూరు కాలేదు. ఇది రైతుల్లో ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

● యాసంగిపై ఆందోళన..

ఖరీఫ్‌సీజన్‌లో భారీనష్టం చవిచూసిన వేలా ది మంది రైతులు ఇప్పుడు రాబోయే యాసంగి(రబీ) సీజన్ గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో నష్టపోయిన పెట్టుబడి తిరిగి రాకపోవడం వల్ల, కొత్తగా పంట వేయడానికి వారి వద్ద ఆర్థికస్తోమత లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వే చేసిన నష్టానికి తగిన ఆర్థికసాయాన్ని విడుదల చేస్తేనే రైతులు అప్పుల భారం నుంచి కొంత ఉపశమనం పొందుతారు. మళ్లీ యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతారు. లేదంటే, జిల్లాలో వేల ఎకరాలు బీడుగా ఉండే ప్రమాదం ఉందని పలువురు చెబుతున్నారు. తక్షణమే సాయం అందించి అన్నదాతను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



బాసరలో పంటను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ (ఫైల్)

సాయం చేస్తేనే తిరిగి నిలబడగలం... :

● రమణారావు, రైతు, బాసర



సర్వే కోసం వచ్చారు. ఫొటోలు తీశారు. లెక్కలు వేశారు. ఇప్పుడు రెండు నెలలు అయిపోయాయి. మాకు ఒక్క రూపాయి కూడా రాలేదు. పంటలు వేయాలంటే అప్పుతప్ప మార్గం లేదు. ప్రభుత్వం సాయం చేస్తేనే మేము తిరిగి నిలబడగలం.

చేతిలో చిల్లి గవ్వ లేదు

● అనసూయ, మహిళా రైతు, బాసర



కౌలు డబ్బులు చెల్లించి సాగు చేసిన 150 ఎకరాలు నీట మునిగింది. కౌలు, పంట పెట్టుబడి కలిపి రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లింది. చేతిలో చిల్లి గవ్వలేదు. కనీసం యాసంగి విత్తనాల కోసం డబ్బులేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. మమ్మల్ని ఆదుకోవాలి.

పండుగ వేళ విషాదం

డీజే సౌండ్‌కు ఇద్దరి మృతి

- బైంసాలో బతుకమ్మ ఆడుతూ గర్భిణి
- నిర్మల్ జిల్లా కేంద్రంలో మరో మహిళ



బైంసా రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బతుకమ్మ ఆడుతూ గర్భిణి మృతిచెందింది. బతుకమ్మ వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి రుషిత (25) బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన రుషితకు వానల్‌పాడ్ గ్రామానికి చెందిన రాజుతో వివాహమైంది. రుషిత అత్తారింట్లో తొలిబతుకమ్మ పండుగ జరుపుకునే సమయంలోనే విషాదం నెలకొంది. వేడుకల్లో తోటి మహిళలతో కలిసి ఆటపాటలతో బతుకమ్మ ఆడింది. రిషితకు నీరసం, తలనొప్పి రాగా ఇంటికి వెళ్లగా... గమనించిన కుటుంబీకులు స్థానికంగా చికిత్స అందించి, బైంసా పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. చికిత్స అందించే లోపే ఆమె మరణించింది. ఆమె మృతి ఇరు కుటుంబాల్లో శోకాన్ని మిగిల్చింది.

గొల్లమాడలో తీవ్ర విషాదం..

నర్సాపూర్(జి) : మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన రుషిత(25) నిర్మల్ జిల్లా బైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో బతుకమ్మ ఉత్సవంలో అకస్మాత్తుగా మరణించడంతో విషాదం నెలకొంది. ఈ దుర్ఘటనతో ఆమె పుట్టినిల్లు అయిన గొల్లమాడ గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలు రుషిత స్వగ్రామం నర్సాపూర్(జి) మండలం, గొల్లమాడ. ఐదు నెలల క్రితమే వానల్‌పాడ్‌కు చెందిన రాజుతో వివాహం జరిగింది. గర్భిణీగా ఉన్న రుషిత శనివారం రాత్రి బతుకమ్మ ఆడుతుండగా అధిక డీజే శబ్దాల (ధ్వని కాలుష్యం) కారణంగా అస్వస్థతకు గురై కుప్పకూలి మరణించింది.

నిర్మల్ జిల్లా కేంద్రంలో..



బిట్లింగు భాగ్యలక్ష్మి (ఫైల్)

నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కాలనీలో శనివారం అర్ధరాత్రి బతుకమ్మ ఆడుతున్న బిట్లింగు భాగ్యలక్ష్మి(56) డీజే సౌండ్ కారణంగా గుండెపోటుతో మృతిచెందింది. పండుగల వేళ డీజే శబ్దాలు పలు మరణాలకు కారణమవుతున్నాయని, ఈ ఘటన పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని స్థానికులు తెలిపారు. ఆమె మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

హద్గాంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

లోకేశ్వరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హద్గాం గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఆ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ భరత మాత చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమానికి ముఖ్య వక్త నాగమణి లింగన్న పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ప్రతిఒక యువకుడు ఆర్ఎస్ఎస్‌లో చేరాలన్నారు. భారతదేశ చరిత్ర గురించి క్షుణ్ణంగా వివరించారు. ఎందరో మహనీయుల చరిత్రను గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ దేశం కోసం ఒక సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తుల్జా భవాని జాతర



భక్తులతో మాట్లాడుతున్న మహరాజ్

నిర్మల్‌రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణాపూర్ గ్రామంలో ఆదివారం తుల్జాభవాని జాతరను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి రాథోడ్ మహేందర్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం జాతర ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు మహరాజ్ ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జాతర సందర్భంగా రూరల్ ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో పోలసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణం


- సుర్జాపూర్‌కు తరలివచ్చిన అశేష భక్తజన వాహిని
- శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవం కనుల పండువగా సాగింది. కల్యాణమహోత్సవ ఘట్టాన్ని తిలకించేందుకు మండల నలుమూలల నుంచి భక్తులు సుర్జాపూర్ కొండపైన ఉన్న వెంకన్నస్వామి సన్నిధికి తరలివచ్చారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో పాటు కలిసి శ్రీవారికల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యాజాన్సన్ నాయక్ సైతం శనివారం రాత్రి సుర్జాపూర్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు చక్రపాణి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణమహోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జిల్లాలో భారీ వర్షం



వర్షానికి దెబ్బతిన్న వరి పంట

నిర్మల్ రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంతో పాటు రూరల్ మండలంలో ఆదివా రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వర్షం కురవడంతో స్థానికులతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణంలో ఒకేసారి మార్పు వచ్చి వర్షం కురవడంతో మొక్కజొన్న, సోయా పంటలపై టార్పాలిన్‌లతో పంటను తడవకుండా కాపాడారు.

లోకేశ్వరం : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన అతిభారీ వర్షం కురిసింది. దాదాపు ఈ వర్షం గంటకు పైగా కురిసింది. ఈ వర్షానికి రైతులు నానా ఇబ్బందులు పడవలసి వచ్చింది. చేతికి వచ్చిన పంటలు సోయా, మక్కలు తడిసి ముద్దయ్యాయి. అలాగే ఈ వర్షానికి వరిపంట దెబ్బతింది. అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నామని, తమను ఆదుకోవాలని అధికారులను కోరారు.

స్పీడ్‌బ్రేకర్‌కు రంగులు వేసిన చిన్నారులు



స్పీడ్‌బ్రేకర్‌కు తెల్లని రంగు వేస్తున్న చిన్నారులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రత్నాపూర్ కాండ్లీ నుంచి తం డాకి వెళ్లే రహదారిపై ఉన్న స్పీడ్‌బ్రేకర్ రాత్రి సమయంలో కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కాలనీకి చెందిన చిన్నారులు స్పీడ్‌బ్రేకర్‌పై తెలుపు రంగువేసి కనిపించేలా చేశారు. చిన్నారులను అభినందించారు.

పోటీకి సై అంటున్న యువత

- ఆశావహుల్లో ఉత్సాహం
- ఎన్నికలపై చర్చ
- పల్లెల్లో స్థానిక సందడి
- పెరుగుతున్న అభ్యర్థులు



ముథోల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పోరుకు సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో ఇటీవల సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్థానిక స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేసింది. పల్లెల్లో పంచాయతీ పండుగ వాతావర ణం నెలకొంది. ఆశావాహులు ఉత్సాహంతో ఉన్నారు. ముఖ్యం గా యువత మొగ్గు చూపుతున్నారని తెలుస్తుంది. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతంకు ప్రాధాన్యత ఇస్తూ రిజర్వేషన్‌లు ఖరారు చేసింది. ఈసారి రిజర్వేషన్‌లు అనుకూలించిన వారు పోటీ చేస్తామని చర్చ జరుగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత, తాజా మాజీలు కసరత్తు చేస్తున్నారని చెప్పుకోవచ్చు. ముథోల్ నియోజకవర్గంలోని ఆశావహులు తమ కార్యాచరణ శ్రీకారం చుట్టారు. ప్రభు త్వం గ్రామ పంచాయతీ వారీగా ఓటరు నమోదు కార్యక్రమంతో పాటు ఓటరు లిస్ట్ నివేదికను సిద్ధం చేసింది. దీంతో గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఆశావాహులు తమ కసరత్తును మొదలుపెట్టారు. ఈసారి ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ కొందరు నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌గా బరిలో నిలిచేందుకు నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. తమ కులసంఘాలకు కొందరు నాయకులు ఇప్పటి నుంచే మాట చేరవేస్తున్నారు. రిజర్వేషన్ అనుకూలం వచ్చింది. నేను పోటీ చేస్తాను మీ మద్దతు మాకే కావాలి అంటూ గుసగుసలు మొదలయ్యాయి. ఈసారి అధిక సంఖ్యలో ఆయా గ్రామాల్లో యువత పోటీ చేసేందుకు ఆసక్తి కనబడుతున్నట్లు తెలుస్తుంది. అయితే ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తాను చాటేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే ముథోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బీజేపీ పార్టీ నుంచి గెలుపొందారు. అయితే ఈసారి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాగైనా తమ పార్టీ నుంచి అధిక సంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలిపించుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. తమ పార్టీయే రాష్ట్రంలో అధికారంలో ఉం దని, దాదాపు అన్ని స్థానాల్లో గెలుపు తమదేనని కాంగ్రెస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ పల్లెల్లో స్థానిక ఎన్నికల సమరం రసవత్తరంగా జరుగనుంది. ఈసారి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌గా పోటీ చేస్తాం. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించండి అంటూ కొందరు ఆశావహులు సోషల్‌మీడియాలో తెలుపుతున్నారు. ఏది ఏమైనా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైందని చెప్పుకోవచ్చు. ఆశావహులు తమ కసరత్తును మొదలు పెట్టారు. నియోజకవర్గంలోని ముథోల్, బాసర, తానూర్, లోకేశ్వరం, భైంసా, కుంటాల, కుబీర్ మండలాలు కలసి మొత్తం 173 గ్రామ పంచాయతీలు, 237 గ్రామాలు ఉన్నాయి. అయితే జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో యువతనే ఎక్కువ శాతం బరిలో దిగేందుకు ఆసక్తిచూపనున్నట్లు తెలుస్తుంది. కొన్ని గ్రామాల్లో అయితే నాయకులు ఇప్పటి నుంచే ఓట్లు ఆకర్షించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పది మంది ఉన్నచోట నాయకులు వెళ్లి వారిని పలకరించడం చేస్తున్నారు. ఈసారి అవకావం వచ్చింది. పోటీ చేస్తానంటున్న కాక అని అన్న, తమ్ముడు అంటూ వరుసలు పెట్టి పలకరిస్తున్నారు. మన గ్రామ అభివృద్ధికి పాటుపడతానని, గ్రామం రూపురేఖలు మారుస్తానని చెబుతున్నారు. ముథోల్‌లోని పలు గ్రామాల్లో యువకులు తమకు మద్దతు ఇవ్వండి తాను పోటీ చేస్తానని, నీ కోసమే నీ మాట కోసమే ఎదురుచూస్తున్నానని రాయబారాలు పెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మీ కుల సంఘం మద్దతిస్తే నాయకు విజయం ఖాయం అంటూ బరిలో దిగే నాయకులు ఇప్పటి నుంచే ఓట్ల కోసం కాక పడుతున్నారు. దీంతో పల్లెల్లో సందడి నెలకొంది.

శారదా దేవికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళా మండలి ప్రతినిధులు

భైంసా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోపాల్ కృష్ణ మందిర్, ఆర్యవైశ్య మండలి భవన్‌లో శారద దేవి వేడుకలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శనివారం ప్రారంభమైన వేడుకలు ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి. వేడుకలలో భాగంగా ఆదివారం ఆర్యవైశ్య మండలి ప్రతిష్ఠించిన విగ్రహం వద్ద మండలి మహిళా ప్రతినిధులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సాముహిక కుంకుమార్చన , ప్రత్యేక అర్చన కార్యక్రమాలను భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.108 మంది మండలి మహిళలు సాముహికంగా లలిత సహస్ర నామ పారాయణను చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకలు ఆద్యాంతం కనుల పండువగా కొనసాగాయి.

ముగిసిన దుర్గమ్మ నిమజ్జనోత్సవం

బాసర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి నది తీరంలో దుర్గామాతల నిమ్జనోత్సవం రెండోరోజు ఆదివారం కొనసాగింది. శనివారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం. ఆదివారం సాయంత్రం వరకు సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 500 దుర్గామాత విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో విగ్రహాలను బాసరకు తెచ్చి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. అనంతరం స్వాములు నదిలో స్నానాలు ఆచరించి దీక్ష విరమించుకున్నారు. దీంతో నది తీరమంతా సందడి నెలకొంది.



అంబాజి జాదవ్‌కు నివాళి అర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణ

ఘనంగా ఖానాపూర్ తొలి ఎమ్మెల్యే జయంతి

ఉట్నూర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గం తొలి ఎమ్మెల్యే అంబాజి జాదవ్ 107వ జయంతిని ఆదివారం మండలంలోని చీమనాయక్ తండాలో కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క-భుజంగరావు దంపతులు హాజరై అంబాజి జాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ అంబాజి జాదవ్ మహోన్నత నాయకుడని, ఆయన కాలంలోనే ఉట్నూర్‌లో ఐటీడీఏ, ఐటీఐ కళాశాల, జూనియర్ కళాశాల, 20 పడకల ఆసుపత్రి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ఆయన 1952 నుంచి 1978 వరకు నాగపూర్ సర్పంచ్‌గా, అనంతరం 1978లో ఏర్పడిన ఖానాపూర్ నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా, 1983లో రెండోసారి ఎమ్మెల్యేగా, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా సేవలందించారని గుర్తు చేశారు. ఇందులో అంబాజి జాదవ్ మనుమడు, కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునిల్ జాదవ్, మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, సురేష్‌జాదవ్, నరేష్ చౌహాన్, సంజీవ్ రాథోడ్, గురుజల శ్రీహరి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు : సీఐ

● చర్లపల్లి జైలుకు ఒకరి తరలింపు

ఇచ్చోడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల విధులను నిర్వర్తించకుండా వారిపై దాడులకు పాల్పడుతూ అక్రమాలకు పాల్పడుతున్న ఇచ్చోడ మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన షేక్ అల్తాఫ్ అనే వ్యక్తిని పీడీ యాక్టు కేసులో ఆదిలాబాద్ జిల్లా జైలు నుంచి చర్లపల్లి జైలుకు తరలించినట్టు సీఐ బండారి రాజు తెలిపారు. ఇప్పటి వరకు 11 కేసులు అతనిపై నమోదయ్యాయన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రభుత్వ అధికారులపై దాడులకు పాల్పడిన వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కృషి'

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా గడ్డం వెంకటస్వామి అహర్నిశలు కృషి చేశారని మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్ అన్నారు. పట్టణంలోని మాల సంక్షేమ సంఘ భవనంలో ఆదివారం వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి సమర్పించారు. సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా గడ్డం వెంకట స్వామి అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ఇందులో సంఘం నేతలు బొబ్బిలి సుధాకర్, మేకల మల్లన్న, సురం భగవాండ్లు, సింగరి అశోక్, పాశం రాఘవేంద్ర, రాళ్ల బండి శంకర్, చిలుక పోచన్న, తొగరి ప్రకాష్ పాల్గొన్నారు.



గడ్డం వెంకట స్వామి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నేతలు

స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలి

● ఆదిలాబాద్ నగర్ సంఘ్ చాలక్ లోక కల్యాణ్‌రెడ్డి



జైనథ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతీ పౌరుడు స్వదేశి వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని ఆర్ఎస్ఎస్ ఆదిలాబాద్‌నగర్ సంఘ్ చాలఖ్ డాక్టర్ కళ్యాణ్‌రెడ్డి ముఖ్య అతిథి లోక కరుణార్‌రెడ్డిలు అన్నారు. ఆర్ఎస్ఎస్ వంద రోజుల దసర ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జైనత్ మండలంలోని దీపాయిగూడ రామాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశం విశ్వగురువుగా ఉండేదని స్వదేశియులు నలంద, తక్షశిల విశ్వ విద్యాలయాలకు చదువుకోవడానికి వచ్చే వారని తెలిపారు. ఉగాది, హిందు సామ్రాజ్య స్థాపన శివాజీ, గురు పూజ ఉత్సవం రక్షాబంధన్, దసరా, సంక్రాంతి పండుగల ప్రాముఖ్యతను తెలియజేశారు. 1925లో కేశవ్ బైరం హెగ్డెవార్ ఆర్ఎస్ఎస్ హిందు సమాజాన్ని స్థాపించి దేశంతో పాటు 80వేల దేశాలలో వ్యాపించిందని అన్నారు. హిందువులందరూ ఐక్యంగా ఉండాలని.. ఇందుకు వ్యక్తిలో మార్పు వస్తే దేశంలో మార్పు వస్తుందన్నారు. ఇందుకు సామాజిక సామరస్యత, కుటుంబ ప్రబోదన్, స్వదేశీ వస్తువుల కొనుగోలు, పర్యావరణ రక్షణ అంశాలపై దృష్టి సారించాలని కోరారు. దీంతో పాటు పౌర విధులను సక్రమంగా పాటించి తమ నైపుణ్యాలను పెంచుకొని దేశ అభివృద్ధికి సైన్యానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జైనథ్, బేల ఖండ్ కార్యవహా చందరాజు, గ్రామపెద్దలు పి.భగవాన్‌రెడ్డిలతో పాటు గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



దీపాయిగూడ సమావేశంలో పాల్గొన్న గ్రామ ప్రజలు (మాట్లాడుతున్న సంఘట్ చాలక్ కల్యాణ్ రెడ్డి)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్ ఎమ్మెల్యేను కలిసిన వీడీసీ సభ్యులు

నేరడిగొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామ విడిసి సభ్యులు ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో గల శబరిమాత ఆలయం వద్ద షెడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పకుండా షెడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

● పలు కుటుంబాలకు పరామర్శ

నేరడిగొండ: మండలంలోని తేజపూర్ గ్రామానికి చెందిన ఏలేటి నవనీత్ రెడ్డి తండ్రి, బడల శ్రీకాంత్ రెడ్డి మేన మామతో పాటు రెడ్ల గిరూమ్ బాయి స్వర్గస్తులైన విషయం తెలుసుకుని వారికి కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. అనంతరం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డిని పలకరించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట మండల నాయకులు, రాథోడ్ సజన్, రవీందర్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

బోథ్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా.. ఆ వ్యక్తి గెలుపు కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ బీమ్రావు పాటిల్, మాజీ ఎంపీటీసీలు రాథోడ్ రాయల్, లంక లలిత, నాయకులు రామ్ కిషన్, సక్కారం అభిలాష్, సుధీర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రెడ్డి కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రెడ్డి సంఘ భవనంలో జరిగిన రెడ్డిల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రెడ్డి అభ్యర్థులకు అభినందనలు తెలిపి శాలువాలతో సన్మానించారు. రెడ్డి కులస్తులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ నేతలుగిమ్మ సంతోష్ రావు, సామ రూపేష్ రెడ్డి, కొండా గంగాధర్, ప్రశాంత్, డేరా కృష్ణరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డి, కార్యదర్శి గోపిడి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగులకు న్యాయం చేసిన సంద అశోక్'

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సంద అశోక్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమన్నీ ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. టీఎన్జీవో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ఉద్యోగులకు చేసిన సేవలను కొనియాడారు. దాదాపు 35ఏళ్ల నుంచి టీఎన్జీవో యూనియన్‌లో ఉంటూ మూడుసార్లు ఉమ్మడి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడిగా, జేఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ ఉద్యోగులకు న్యాయం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కేంద్ర సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్, జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, గజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుమలరెడ్డి పాల్గొన్నారు.



సంద అశోక్‌ను సన్మానిస్తున్న నేతలు

నిర్మిత కేంద్రాలపై.. నిర్లక్ష్యం!

(3వ పేజీ తరువాయి...)

కాంగ్రెస్ ప్రభుత్వంలో కళకళలాడిన గృహ నిర్మాణ శాఖ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తిగా పట్టిపోయింది. ఫలితంగా నిర్మిత కేంద్రాల్లో ఉన్న స్టీల్ ఇసుక సిమెంట్ దొంగల పాలైనట్లు తెలుస్తుంది.

తుప్పుపడుతున్న యంత్రాలు

ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రంలోని వస్తువుల తయారీ ఇనుప పనిముట్లు తుప్పు పడుతున్నాయి. లక్షలాది రూపాయలు కేటాయించి కొనుగోలు చేసిన పరికరాలు నిర్లక్ష్యంగా పడివేయడంతో చెత్త కుప్పల మధ్య తుప్పు పడుతున్నాయి. లక్షలాది నిధులతో ఇటుకల తయారీ యంత్రాలు, ఇసుక సిమెంట్ మిక్సింగ్ యంత్రాలు, పట్టించుకు నే వారు లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపట్టాయి. గత 12 ఏళ్లుగా వీటి గురించి పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వాటి చుట్టు పిచ్చిమొక్కలు ఏపు పెరిగాయి. అంతేకాకుండా ఇదే ప్రాంగణంలో ఉన్న గృహ నిర్మాణ శాఖ అభియాంత కార్యాలయం సైతం పిచ్చి మొక్కల మధ్య దర్శనమిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సరసమైన ధరలకు సిమెంట్ ఇటుకలు, సిమెంట్ తలుపుల ఫ్రేంలు, సిమెంట్ కిటికీల ఫ్రేంలు సరఫరా చేసే అవకాశం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.



లేగదూడకు వైద్యం అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

బోథ్‌లో లేగ దూడపై కుక్కల దాడి

బోథ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమవుతుంది. రాత్రిపూట మేకల పైన, పశువులపైన దాడులకు పాల్పడుతున్నాయి. శనివారం అర్ధరాత్రి మార్కెట్ యార్డులో ఉన్న లేగదుడపై కుక్కల మంద దాడి చేసింది. దీనితో పశువుకు తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది వెంటనే స్పందించి మార్కెట్ యార్డులో పడి ఉన్న పశువు వైద్యం అందించారు. ఏదిఏమైనా ఆదివారం సెలవు దినం రోజులో సహితం మూగజీవాలకు వైద్యం అందించిన సిబ్బందిని పలు అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆదిలాబాద్(నార్నూర్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదవారికి అందించే ఉచిత పీడీఎస్ బియ్యాన్ని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన వ్యాపారస్తులు కోటగిరి విశాల్, చింతవార్ సత్యనారాయణ క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఆదివారం పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. వారి దగ్గర నుంచి రెండు క్వింటల్ 85 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిపై ఎస్సెన్షియల్ కమోడిటీస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ పి.ప్రభాకర్ మాట్లాడుతూ పేదవారికి అందించే బియ్యాన్ని దారి మళ్లించడం లేదా దుకాణాలు వద్ద అక్రమంగా నిల్వ ఉంచడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్సై కె.అఖిల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బతుకమ్మలో ఘర్షణ : ముగ్గురిపై కేసు

నర్సాపూర్(జి), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సెప్టెంబరు 30, 2025న రాత్రి బతుకమ్మ ఉత్సవాల్లో ఘర్షణ జరిగింది. పాత కక్షలు, మద్యం మత్తు కారణంగా ఈ దాడి జరిగిందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్శనం లక్ష్మణ్(47) ఇచ్చిన ఫిర్యాదు మేరకు బర్కుంట లక్ష్మణ్ బూతులు తిట్టి దాడి చేయగా, అతని కుమారుడు, బంధువులతో పాటు దర్శనం ఎల్లన్న, దర్శనం లింగం, మరికొందరు కలిసి లక్ష్మణ్‌ను కొట్టి కింద పడేశారు. ఈ దాడికి సంబంధించిన వీడియో సాక్ష్యాన్ని ఫిర్యాదుదారు పోలీసులకు అందజేశారు. అక్టోబరు 4న ఫిర్యాదు అందడంతో నర్సాపూర్(జి) పోలీసులు ముగ్గురు ప్రధాన నిందితులపై కేసు నమోదు చేశారు. ముఖ్య నిందితుడు మద్యం సేవించి ఉండటంతో గ్రామంలో పెరుగుతున్న గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసును లోతుగా విచారించాలని కోరుతున్నారు. ఎస్సై కే. గణేష్ దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణా దుకాణంలో మద్యం విక్రయాలు : ఒకరి అరెస్ట్



కిరాణా దుకాణంలో పట్టుబడిన మద్యం

నర్సాపూర్(జి), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి(జి) గ్రామంలో కిరాణా షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పవార్ సంజీవ్(35) అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నర్సాపూర్(జి) ఎస్సై పీకే గణేష్‌కు అందిన సమాచారం మేరకు ఈ నెల 1న బుధవారం రోజు రాత్రి దాడి చేసి నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం 13.49 లీటర్లు (రూ.7,656.5 విలువ) వివిధ రకాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంజీవ్‌పై కేసు నమోదు చేశారు.

గొడవలకు దిగుతున్న యువకులపై చర్యలు తీసుకోండి



సమస్య తెలియచెప్పడానికి పోలీసుస్టేషన్‌కు వచ్చిన మహిళలు

భైంసా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలనీలో దురుసు ప్రవర్తన ధోరణితో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యువకులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని భైంసా పట్టణ పరిధిలోని పులేనగర్ కాలనీ మహిళలు టౌన్ పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాలనీ పరిధిలోని 50 మందికి పైగా మహిళలు పోలీసు స్టేషన్‌కు తరలివచ్చి సంబంధిత విషయంలో పోలీసు అధికారులతో మాట్లాడారు. దమ్మ చక్ర పరివర్తన్ దివాస్ వేడుకలతో పాటు దసరా పర్వదిన వేడుకలలో కాలనీకు చెందిన కొంత మంది యువకులు మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ గొడవలకు దిగుతున్నారని ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై భౌతికంగా దాడులకు తెగపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వివరించారు. యువకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతుండటంతో తాము ఆందోళన చెందుతున్నామని పేర్కొన్నారు. సంబంధిత యువకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువులో పడి ఒకరి మృతి

ముథోల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని నయాబాదికి చెందిన సయ్యద్ ఖాసీం అలీ(54) కుంట చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ఖాసీంఆలీ ఆదివారం కుంట చెరువుకు స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుల ఆర్థిక సహాయం

సారంగాపూర్, అక్టోబరు 5 (ఆం ధ్రజ్యోతి) : మండలంలో గల ఆలూ రు గ్రామానికి చెందిన యువకులు క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని మొద టిబహుమతి రూ.5వేలను గెలుపొందారు. రూ.6వేలను ఆ గ్రామానికి చెందిన రెంజర్ల చిన్నమ్మాయి కుటుంబానికి ఆర్థిక సహాయం కింద రూ.6వేలను నిత్యవసర వస్తువులను అందజేశారు. దీంతో గ్రామస్థులు యువకులను ఈ సందర్భంగా అభినందించారు.

ఘనంగా మహిళల గాజుల పండుగ

లోకేశ్వరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్ గ్రామంలో ఆదివారం మహిళా దోస్తుల గాజుల పండుగ ఆనవాయితీగా మారింది. దోస్తులు గాజులు వేసుకుంటే బాగుంటారన్న సాంప్రదాయంతో ఏకీభవించి మహిళలు గొప్పగా ఈ గాజుల పండుగ జరుపుకుంటున్న విషయం తెలిసింది. ఆదివారం మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన మహిళలు గాజుల పండుగను కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. గల్లీ మహిళలందరూ స్థానిక దేవి సన్నిధిలో ఏకరూప దుస్తులను ధరించి, ముందుగా గోరింటాకును ఒకరికొకరు పెట్టుకున్నారు. అందరూ పసుపు, కుంకుమ, పూలు ధరించి సంప్రదాయబద్ధంగా ఒకరికొకరు వారి స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ గాజులు వేసుకున్నారు. అనంతరం వంటలు చేసుకొని భోజనాలు చేశారు. తదనంతరం కాలక్షేపానికి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని కబడ్డీ, ఖోఖో, తదితర ఆటలను ఆడారు. అంత్యాక్షరీ, పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య గాజుల పండుగను నిర్వహించుకున్నారు.



ఒకరికొకరు గాజులు వేసుకుంటున్న మహిళలు



గాజుల పండుగను జరుపుకుంటున్న మహిళలు

లక్ష్మణచాంద : మండలంలోని పీచర గ్రామంలో ఎఫ్‌జెడ్ ఫామ్ హౌస్‌లో జిల్లా పరిషత్ హైస్కూల్ వడ్యాల్ 1995-96 బ్యాచ్ వారందరూ కుటుంబ సమేతంగా ఆదివారం గాజుల పండుగ జరుపుకున్నారు. స్నేహితులందరూ ఒకరికొకరు గాజులు వేసుకున్నారు. గోరింటాకు పెట్టుకున్నారు. అందరూ ఎల్లప్పుడు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో సంతోషంగా జీవితాన్ని గడపాలని కోరుకున్నారు. అక్కడే వంటలు చేసుకుని భోజనాలు చేసి రోజంతా ఆనందంగా గడిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



విజేతకు బహుమతి అందిస్తున్న జాన్సన్ నాయక్

పెంబి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 15 రోజుల నుంచి నిర్వహిస్తున్న పెంబి ప్రీమియర్ లీగ్ సీజన్‌కు ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ టోర్నమెంట్‌లో 8 టీంలు పాల్గొనగా అందులో విజేతగా రన్‌రూలర్స్ రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా డైనమిక్ పంతర్ రూ.12 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలను బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అలాగే మారుమూల ప్రాంతంలో ఇంత పెద్ద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సల్ల నరేందర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, తులాల శంకర్, గోవింద్, సంతోష్, బడుగు మల్లేష్, విలాస్, ప్రశాంత్ రెడ్డి, బింగి రవి, భూక్యా సంతోష్, జైవంత్, నల్ల దేవేందర్ పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ అభినందనీయం

నిర్మల్ రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడ్ ఎగ్జామ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మొట్టమొదటి మహిళా శిక్షకురాలు (పట్టణంలోని రామ్ రావ్ బాగ్‌కు చెందిన) కిన్నెర్ల మృణాళిని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాపోలు సుదర్శన్ చేతుల మీదుగా ఇంటర్నేషనల్ బ్లాక్‌బెల్ట్ 4వ డాన్ అవార్డు తీసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్ బాటియా, జిల్లా అధ్యక్షులు కొండాజి శ్రీకాంత్, అమ్ముల భూషణ్, చందుల స్వామి, శ్రీరాములు సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కిన్నెర్ల మృణాళిని సన్మానిస్తున్న దృశ్యం

మూడు ఇళ్లల్లో చోరీ

నర్సాపూర్(జి), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర వేడుకలను ఆసరాగా తీసుకున్న దొంగలు పట్టణంలోని ఆరవ వార్డులో రెచ్చిపోయారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో ఒకేసారి ముగ్గురి ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్‌కు కేవలం వంద మీటర్ల దూరంలోనే ఈ దొంగతనాలు జరగడం స్థానికుల్లో తీవ్ర భయాందోళన కలిగిస్తున్నాయి.

డీజే శబ్దాలను ఆసరాగా చేసుకొని...

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దుర్గామాత శోభాయాత్ర సందర్భంగా డీజే శబ్దాలు మార్మోగుతుండటంతో దొంగలు ఆ సౌండ్‌ను అలుసుగా తీసుకుని సులభంగా చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో దొంగలు మొదట తోడేలు చిన్నక్క ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తెరిచేందుకు ప్రయత్నించినా అందులో ఏమీ లభించకపోవడంతో పక్కనే ఉన్న సువిలా ఇంటిని లక్ష్యంగా చేసుకున్నారు. సువిలా ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువాను పగులగొట్టి దాదాపు రూ. 6 వేల నగదు, సుమారు రూ. 40 వేల విలువ చేసే పట్టి గొలుసులు, బుట్ట కమ్మలు దొంగలించారు. అనంతరం వెనుక వైపు ఉన్న మీబిన్ ఇంటిలో కూడా చోరీకి పాల్పడ్డారు. అక్కడ బీరువా పగులగొట్టి రూ. 20 వేల నగదు, దాదాపు 9 మాసాల బంగారు నగలను అపహరించారు. మొత్తంగా మూడు ఇళ్లల్లో కలిపి లక్ష రూపాయలకు పైగా నగదు, బంగారం చోరీకి గురైనట్లు అంచనా.

ఉదయం వెలుగులోకి వచ్చిన దొంగతనం...

ఉదయం సుమారు 5 గంటల ప్రాంతంలో నిద్ర లేచిన తోడేలు చిన్నక్క, తన ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటం గమనించి అనుమానం వచ్చి పక్కింటి వారిని అడిగింది. అప్పుడే సువిలా, మీబిన్ ఇళ్లల్లో కూడా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది.

పోలీసులకు సవాల్...

పోలీస్ స్టేషన్ నుంచి కేవలం 100 మీటర్ల దూరంలోనే ఈ దొంగతనాలు జరగడం దొంగలు మరోసారి పోలీసులకు సవాల్ విసిరారనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అంతే కాక ఇదే ప్రాంతంలో గతంలో కూడా చోరీలు జరిగాయి. రెండు సంవత్సరాల క్రితం తోడేలు చిన్నక్క ఇంటి ముందరి నుంచే జెడ్ల రవికి చెందిన నాలుగు మేకలను దొంగలు ఆటోలో అపహరించుకుపోయిన ఘటన గుర్తు చేసుకున్నారు. ఒకే వార్డులో పదేపదే చోరీలు జరుగుతుండటంతో వార్డు సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. సంఘటన స్థలానికి ఉదయం 7 గంటల ప్రాంతంలో చేరుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించి, నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు.

కనకాపూర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

లోకేశ్వరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్ గ్రామంలో సాయంత్రం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. గునుగు, తంగేడు, బంతి రకరకాల పూలను సేకరించి మహిళలు, పిల్లలు బతుకమ్మలను అందంగా పేర్చి, పూజలు చేశారు. ముందుగా హనుమాన్ మందిరానికి వెళ్లి పూజలు చేశారు. అలాగే దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఆయావీధుల గుండా బతుకమ్మ పాటలతో ఊరేగింపు నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో గౌరమ్మను కొలిచారు. అంతా ఒక్కచోట చేరి బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. కోలాటాలు, బతుకమ్మ పాటలతో మార్మోగింది. అనంతరం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.



చెక్ డ్యామ్ నిండా పిచ్చి మొక్కలు, నీటి నిల్వ

చెక్ డ్యామ్ పూడిక తీయించండి సారూ

బోథ్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని టివిటి గ్రామం సమీపంలో దశాబ్దం కింద నిర్మించిన చెక్ డ్యామ్ నిండా పిచ్చి మొక్కలు పెరగడంతో నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోతుంది. గత సంవత్సరం క్రితం గ్రామస్థులు చెక్‌డ్యామ్ పూడికను తీ శారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇసుక మట్టి కొట్టుకు వచ్చి పిచ్చి మొక్కలతో నిండింది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం లేకుండా పోయిందని గ్రామస్థులంటున్నారు. ఉపాధి హామీ కార్యక్రమంలోనైనా ఈ ఏడాది చెక్ డ్యామ్ పూడిక తీయించినట్లయితే ఉపయోగపడే వీలుంది.

భక్తిశ్రద్ధలతో దేవీ విగ్రహ నిమజ్జనం



బరంపూర్‌లో శారద దేవి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

తలమడుగు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపురం గ్రామంలో దసరా నవరాత్రుల సందర్భంగా ప్రతిష్టించిన శారద దేవి మాతను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. గత తొమ్మిది రోజులుగా దేవీ మాతకు వేద పండితులతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా భక్తిశ్రద్ధలతో భాజా భజంత్రీలతో నిమజ్జనాన్ని నిర్వహించారు. అదేవిధంగా భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో బరంపురం వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేథరేశ్వర్ రెడ్డి, గ్రామ కాపు మెరుగు మోహన్ రెడ్డి. గ్రామ పెద్దలు మల్లారెడ్డి, ప్రతాప్. నాగారెడ్డి, రాజు, రమాకాంత్, బి. మల్లేష్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న మహిళలు

కదలని రాళ్ల కింద దాగిన కనకాయి చరిత్ర

● ఆనవాళ్లను కాపాడుకోవాలంటున్న స్థానికులు



కనకాయి వద్ద ఇంటి నిర్మాణంలో గుర్తుగా మిగిలిన పేర్చిన బండరాళ్లు

బజార్ హత్నూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శత్రు దుర్భధ్య కందకం.. ఇళ్ల సముదాయాలు.. గ్రామ వీధి.. జాలువారే జల పాతం.. ఆనాటి చారిత్రక శిల్పం.. స్నానమాచారించేందుకు కోనేరు.. వెరసి ఇవే కనకాయి చారిత్రక ఆనవాళ్లు. ఈ ప్రదేశంలోని కదలని రాళ్ళ కింద అలనాటి చరిత్ర దాగి ఉండటానికి ఈ అవశేషాలే ఉదాహరణలు. బజార్ హత్నూర్ మండల పరిధిలో గల గిర్నూర్ గ్రామ సమీపంలో కనకాయి జలపాతం ప్రాంతంలో ఇప్పటికీ నిక్షిప్తమై కనిపిస్తాయి. కాలగర్భంలో కలిసిపోతున్న కొన్నింటిని పరిశీలిస్తే ఆనాటి చారిత్రక ఆనవాళ్లు మచ్చుకు కొన్ని కనిపిస్తాయి. ఇక్కడి వాస్తవాలను తెలుసుకున్న అప్పటి జిల్లా కలెక్టర్ అహ్మద్ బాబు పురావాస్తు నిపుణులతో ప్రయత్నం చేస్తుండగానే ఆయన బదిలీ కావడంతో ప్రణాళిక అక్కడే ఆగిపోయింది. ఇక్కడి పురాతన ఆనవాళ్లు కాలగర్భంలో తమ ఉనికిని కోల్పోకుండా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని కాపాడుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన: ఎస్సై

లోకేశ్వరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయపూర్(కే) గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ... ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని పలు సూచనలు చేశారు. ఒకవేళ చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారి పైన కేసు నమోదు చేస్తామన్నారు.

బాసరలో పెరిగిన కుక్కల బెడద

● అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు, స్థానికుల ఆగ్రహం



బాసర అమ్మవారి ఆలయం సమీపంలో వీధి కుక్కల స్వైర విహారం



గాయపడిన బాలుడు

బాసర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాసర పుణ్యక్షేత్రంలో పిచ్చి కుక్కల స్వైర విహారం స్థానికులు, భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అధికాయుల సమస్యను పట్టించుకోక పోవడంతో రోజురోజుకు ఈ దాడులు పెరుగుతున్నాయి. తాజాగా ఆదివారం బాసరకు చెందిన అల్లి అబ్దుల్లా అనే బాలుడిపై ఓ వీధి కుక్క దాడి చేసి తీవ్రగాయాలు చేసింది. అదృష్టవశాత్తు, స్థానికులు వెంటనే స్పందించిడంతో బాలుడికి ప్రమాదం తప్పింది. వెంటనే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. స్థానికంగా కుక్కల బెడద అధికమవడంతో కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్ దుకాణాల పరిసరాల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉంటోందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయపడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

● అమ్మవారి భక్తులకు తప్పని కష్టాలు..

సరస్వతి అమ్మవారి ఆలయం పరిసరాల్లోనూ పిచ్చి కుక్కల బెడద ఎక్కువయింది. ఆలయానికి వచ్చే యాత్రికులపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటనలున్నాయి. గుంపులుగా తిరిగే ఈ కుక్కలను చూసి భక్తులు, ముఖ్యంగా తెల్లవారుజామున పూజలను వచ్చేవారు, తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులు, భక్తులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు పెరిగి పోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికయిన సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే ఈ పిచ్చికుక్కల సమస్యను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని బాసర గ్రామస్థులు, యాత్రికులు కోరుకుంటున్నారు.

హిందువుల ఐక్యతకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి



మాట్లాడుతున్న ప్రధాన వక్త రాజేష్ సింగ్



సమావేశానికి హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు



భైంసాలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ధర్మ జాగరణ టోలి సభ్యులు బ్రహ్మబట్ రాజేష్ సింగ్ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ వివేక్ నగర్ బస్తీ ఆధ్వర్యంలో స్థానిక మున్నూరు కాపు సంఘ భవనంలో విజయ దశమి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త బ్రహ్మబట్ రాజేష్ సింగ్ (ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ధర్మ జాగరణ టోలీ సభ్యులు) ప్రసంగించారు. 1925లో ప్రారంభమై నేడు దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పని చేస్తుందని చెప్పారు. హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘం పెంపొందిస్తుందని పేర్కొన్నారు. హిందుత్వ జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిం దుత్వంలో ఉన్నాయని వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజుల్లో ఇంటింటి జన జాగరణ చేపట్టబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డా. చింత పండు రవి మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ఈ దేశ అఖండతకు, వ్యక్తి నిర్మాణానికి, హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు అందరూ స్వా గతించాలని కోరారు. ఈ కార్యక్రమం లో నగర కార్యవాహ కిన్నెర్ల రవి, డా. మల్లికార్జున్ రెడ్డి, డా. కూన ప్రవీణ్, డా. రఘునందన్ రెడ్డి, ధీరజ్, సైండ్ల శ్రీధర్, గోవర్ధన్, నరేష్, శంకర్, టీఎన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సర్వ మానవాళికి ఆధారం

● సహ సంయోజక్ వేంపల్లి ప్రతాప్

భైంసా: సనాతనమైన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా అచార,వ్యహారాలతో కొన సాగుతున్న హిందుత్వ జీవన విధానం విశ్వంలోని సర్వ మానవాళికి ఆధారమని ఆర్‌ఎస్‌ఎస్ గ్రామ వికాస్ తెలంగాణ ప్రాంత సహ సంయోజక్ వేంపల్లి ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని పులేనగర్ బస్తీలో జరిగిన అర్‌ఎస్ ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో ,విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తోందని పేర్కొన్నారు. హిందువులలో సమన్వయానికి, సంఘటితానికి శాఖ ఆధారంగా సంఘం పెంపొందిస్తుందని వివరించారు. హిందుత్వ జీవన విధానం, విశ్వశాంతికి ఆధారమని వివరించారు. ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయ పరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని పేర్కొన్నారు. సామాజిక సమరసత కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీ వనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతీ ఒక్కరి కుటుంబంలో విధిగా పాటించాలని ఆకాంక్షించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భైంసా ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి డా.నాంపెల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ దేశ అఖండతకు ,వ్యక్తి నిర్మాణానికి ,హిందుత్వ పరిరక్షణఖు ఆర్‌ఎస్‌ఎస్ చేపడుతున్న సేవలను అనిర్వచనీయమైనవన్నారు. ఇందులో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ సంఘ చాలక్ సాధుల కృష్ణదాస్ పాల్గొన్నారు.

పిడుగు పాటు.. ముందే పసిగట్టు

● అందుబాటులోకి సాంకేతిక పరిజ్ఞానం
● దామిని యాప్‌తో ముందస్తు సమాచారం



పిడుగు పాటుతో విరిగి కింద పడ్డ గోపురం భాగం

భైంసా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా జిల్లాలో ఏదో ఒక చోట పిడుగు పాటు ఘటనలు తరుచు చోటు చేసుకుంటున్నాయి. గత అయిదేళ్లలో నిర్మల్ జిల్లాలో దాదాపు 30 మందికి పైగా మృత్యువాత పడ్డారు. సుమారు వంద వరకు మూగజీవాలు సైతం మృత్యువాతపడ్డాయి. గత నెలలో పెంబి మండలంలో పిడుగు పడి ముగ్గురు మృతి చెందారు. ముథోల్ ప్రార్థన మందిరంతో పాటు మామడ మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ గోపురం సైతం పిడుగుపాటుతో దెబ్బతిన్నాయి.



దామిని యాప్

● అందుబాటులోకి సాంకేతిక సేవలు

పిడుగు పాటు బారిన పడకుండా ఉండేందుకు ప్రస్తుతం సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా అపాయాన్ని ముందుగానే గుర్తించే వీలు కలగనుంది. వాతావరణానికి సంబంధించిన వివరాలు తెలుసుకునేలా కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ప్రజలకు ఉపయోగపడేలా ప్రత్యేక యాప్ దామిని (దామిని లైట్నింగ్ అలెర్ట్) తీసుకొచ్చింది. దీని ద్వారా రానున్న 25 నిమిషాల్లో మనం ఉండే ప్రదేశంలో పిడుగు పడే అవకాశాన్ని ముందుగానే తెలుసుకోవచ్చు. అప్రమత్తమై ఆస్తి, ప్రాణ నష్టాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడొచ్చు. ఈ యాప్‌ని ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీన్ని తెలుగులోనూ వాడుకోవచ్చు. తర్వాత మనం ఉండే లోకేషన్ వివరాలు అందులో తెలపాల్సి ఉంటుంది. పిడుగు పడే ముందు.. శరీరానికి ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు, చర్మం జలదరించినప్పుడు పిడుగు పాటుకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి లక్షణాలు అనిపిస్తే తక్షణమే నేలపై పడుకోవాలి. సమీపంలో ఇళ్లు ఉంటే వెంటనే అక్కడికి వెళ్లి రక్షణ పొందాలి.



మామడ మండలంలో దెబ్బతిన్న ఆలయ గోపురం

ఈ జాగ్రత్తలు అవసరం..

● ఆరు బయట ఉంటే ఇళ్లలోకి వెళ్లాలి.
● వర్షం కురుస్తున్నప్పుడు చాలా మంది చెట్ల కిందకి వెళ్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. చెట్లు పిడుగును త్వరగా ఆకర్షిస్తాయి.
● మెరుపులు అధికంగా ఉంటే బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం.
● నీరు ఉన్న ప్రదేశం నుంచి దూరంగా ఉండాలి.



కజర్లలో పత్తి, సోయాబీన్ పంటను ఆరబెడుతున్న రైతులు

ఇంట్లో జాగలేదు.. ప్రభుత్వం కొంటలేదు

● పంట చేతికి వచ్చినా రైతులకు తప్పని ఇబ్బందులు

తలమడుగు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన రై తులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంట చేతికొచ్చిన ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో ఇంట్లో జాగలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో రైతులు పండించిన పత్తి, సోయాబీన్ పంట చేతికి వచ్చిన ప్రభుత్వం ఇంకా కొ నుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రు. పండించిన పంటను ఇంటి వద్ద నిల్వ ఉంచేందుకు స్థలం లేకపోవడంతో గ్రామ పొలిమేరలోని ఖాళీ స్థలంలో నిలువ ఉంచవలసిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా రైతుల పండించిన పంటను తేమ పేరిటకు కొర్రీలు పెట్టడంతో బీమా శాతం తగ్గించేందుకు రైతులు బయట ఆరబెడుతున్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాలతో పత్తి పంటలోను సోయ పంటలోను సరైన దిగుబడి రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం పత్తి పంటలో ఎకరానికి నాలుగు నుంచి ఐదు గంటల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం దృష్టి సాధించి క్వింటాల్‌కు పదివేల రూపాయలతో కొనుగోలు చేయాలని రైతుల కోరుతున్నారు. అదేవిధంగా సోయాబీన్ పంటలోను దిగుబడి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్లే దిగుబడి వచ్చిందన్నారు. ప్రభుత్వం దృష్టి సా రించి రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

గుంతలతో రోడ్డు ప్రమాదాలు

● చోద్యం చూస్తున్న అధికారులు
● లారీ బోల్తా డ్రైవర్ క్లీనర్లకు స్వల్ప గాయాలు

ఉట్నూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రహదారులపై ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతీ వారం రెండేసి ప్రమాదాలు జరుగుతున్న అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వ ర్షాలకు ఉట్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రహదారి పై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దంతన్‌పల్లి వంతెన వద్ద ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇదేకాకుండా బీర్సాయిపేట రాంనగర్ దాటి అల్లంపల్లి చౌరస్తాకు సమీపంలో రోడ్డు పైన ఏర్పడిన గుంత వద్ద ఆదివారం భారీ లోడుతో వెళ్తున్న లారీ ఈ గుంత వద్ద అదుపు తప్పి పడిపోయింది. ఆర్ అండ్‌బీ అధికారులు ఏ మాత్రం గుంత పూడ్చడానికి ఏ మాత్రం స్పందించక పోవడంతో రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులే ఒక కర్రకు ఎర్రని బట్ట కట్టి దారి మధ్యలో పెట్టారు. ఆదివారం రాజస్థాన్ ప్రాంతం నుంచి విజయవాడ వైపు లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ గుంతను గమనించక పోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నందున రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు మొహమ్మద్ మునీర్ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్అండ్‌బి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను కోరుతున్నారు.

అపూర్వం.. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు

దస్తురాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ 2000ల బ్యాచ్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై పాత జ్ఞాపకాలను తలచుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. అనంతరం పాఠశాల పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు తమ విద్యా కాలంలో జరిగిన సంఘటనలను, పాఠశాలలో నేర్చుకున్న విలువలను గుర్తు చేసుకున్నారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ఉత్సాహంగా ముగిశాయి.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, అక్టోబరు, 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల గజ్జమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. దసరా పండుగ అనంతరం అడెల్లి పోచమ్మ జాతర ముగిసిన సందర్భంగా మొదటి ఆదివారం రోజు గ్రామస్థులు అధిక సంఖ్యలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ్జలమ్మకు ప్రీతికరమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నిండిన చెరువులు.. ఆనందంలో రైతులు



వర్షాలకు నిండిన ఉట్నూర్‌లోని గోపయ్య చెరువు



నిండిన గంగన్నపేట చెరువు




నిండిన నాగపూర్ ప్రాజెక్టు

● జోరుగా వరి పంట సాగు..

ఉట్నూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉట్నూరు ఏజెన్సీలోని సాగు నీటి వనరులు అయిన చేరువుల్లో సమృద్ధిగా నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూరు, గాదిగూడా మండలాల్లోని గిరిజన ప్రాంతాల రైతులకు సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో చెరువులు, చిన్న చిన్న కుంటలపై ఆదారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు.దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాల రైతుల కోసం సాగునీటి వనరులను కల్పించడంలో ప్రభుత్వాలు అంతగా శ్రద్ధ చూపలేదు. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉన్న మైనర్ ఇరిగేషన్ కార్యాలయం ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో చేరువుల నిర్మాణానికి, కుంటల నిర్మాణానికి భారీగా కృషి చేయడంలో అప్పుడు నిర్మించిన సాగునీటి వనరులే గిరిజన ప్రాంతాల రైతుల భూములకు సాగునీరు అందిస్తున్నాయి, ఖానాపూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన స్వర్గీయ రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో ఉట్నూరు మండలంలోని వాగులపై నాగపూర్ మత్తడి ప్రాజెక్టులు మంజూరు చేయించడంతో ఉట్నూరు మండలంలోని రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చింది.మత్తడిప్రాజెక్టు ఉట్నూరు ప్రాంతంలోని బాయమ్మకుంట చేరువుకు నీరు చేర్చడం ద్వారా ఇది ఫీడర్ చెరువుగా మారి గోపాయి చెరువు, నేరుడు చెరువు, గంగన్న పేట చెరువు సరస్వతి చెరువు, ఎల్లమ్మ చెరువులకు నీరు అందిస్తుంది.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లో సమృద్ధిగా నీరు చెరడంతో రైతులు పంటలు పండించడానికి నీరు అందుబాటులోకి వచ్చేసిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాగపూర్ ప్రాజెక్టు నిండిపోవడంతో ఈ ప్రాంతంలోని నాగపూర్, షాంపూర్, లింగోజి తండా ప్రాంతాలలోనిరైతులు పంటలకు సాగునీరు అందుబాటులోకి వచ్చిందని భావిస్తున్నారు. మండలంలోని దంతంపల్లి బీర్సాయిపేట ప్రాంతాల్లో ఉన్న చెరువులు కూడా వర్షాలకు నిండాయి.

● చెరువుల కింద వరి పంటలు..

ఉట్నూరు మండలంలోని రైతులు చెరువుల కింద ఉన్న భూముల్లో వరి ధాన్యం సాగు చేస్తున్నారు. ఉట్నూరు మండలంలోనికొమ్ముగూడెం, లక్కారం, ఉట్నూరు, గంగన్నపేట, పాత ఉట్నూరు, దంతంపల్లి బీర్సాయిపేట ప్రాంతాలకు చెందిన రైతులుసుమారు మూడు నుంచి 350 ఎకరాలలో వరి ధాన్యం పంటలు పండిస్తున్నారు. ఇదే కాకుండా మరికొందరు రైతులు వర్షాలతో 50 ఎకరాల వరకు వరి ధ్యానం సాగు చేస్తున్నారు. ఉట్నూరు మండలంలో 1037 మిల్లీ మీటర్ల వర్షపాతం గత మూడు నెలల్లో నమోదు కాగా ఇంద్రవెల్లి మండలంలో 1202, నార్నూర్ మండలంలోని 967, గాదిగూడ మండలంలో 765 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఇంద్రవెల్లి మండలంలోని అక్కడక్కడ చెరువుల కింద వరి పంటను సాగు చేస్తున్నారు.





● కజర్లలో దేవాలయం సమీపంలో పత్తి పంటను ఆరబెట్టిన రైతులు

ఇంట్లో జాగ లేదు.. ప్రభుత్వం కొంట లేదు!

● పంట చేతికి వచ్చినా.. రైతులకు తప్పని ఇబ్బందులు

5



వర్ధంతి సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి

● ఆదివాసీ విద్యార్థి జిల్లా సంఘం

ఆదిలాబాద్(నార్నూర్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదివాసుల హక్కుల సాధనకు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పెందుర్ సంతోష్ అన్నారు. ఆదివారం గాదిగుడ, లోకారి కొమురం భీం విగ్రహం దగ్గర పోరు గడ్డ జోడేఘాట్ 85వ వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్, జంగల్, జమిన్ కోసం, అటవీ హక్కుల సాధనకు నిరంతరం పోరాడారని కొనియాడారు. వారి వెంట సిడాం నాగోరావు, మెస్రం దేవురావు, ఆత్రం చందు, మోహన్, బాపురావు ఉన్నారు.



వన్యప్రాణుల ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

వన్యప్రాణుల వారోత్సవాలు ప్రారంభం

ఉట్నూర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అడవులకు అందాలను అందిస్తున్న వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌లు గోపాల్‌సింగ్, ప్రేమ్‌సింగ్‌లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అటవి శాఖ కార్యాలయం నుంచి పట్టణంలోని వివిధ వీధుల గుండా అటవి సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల్లో స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. వన్యప్రాణులను ఎవరు వేటాడకుండా ప్రభుత్వం వన్యప్రాణి సంరక్షణ చట్టం చేసిందని వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

స్థానిక సమస్యలే ఎజెండాగా పోటీ

బోథ్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై గత వందేళ్ల కాలంలో పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ.. ఈ సారి ఎన్నికల్లో స్థానిక సమస్యల పరిష్కారమే ఎజెండాగా పోటీ చేస్తుందని సీపీఐ జిల్లా నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం బోథ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున బరిలో ఉంటారని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలం అవుతున్న పార్టీల తీరును ప్రజలు ముందు ఎండగడతామని పేర్కొన్నారు. ఇందులో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా కార్యదర్శికి సన్మానం

ఉట్నూర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ నిర్మల్ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కొండేరి రమేష్‌ని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సీపతి లింగాగౌడ్, నిర్మల్ జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ పొన్నం జగన్, మండల ప్రధాన కార్యదర్శి కాల్వ రవి, సాల్గర్ రవీందర్, ఉష్కముల దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గావ్‌వాసికి ఎంబీబీఎస్ సీటు

భీంపూర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామం అంతర్గావ్‌కి చెందిన గుండావార్ ప్రకాష్ అనే రైతు కుమార్తె అంకిత అనే యువతి జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో అంకితను గ్రామపెద్దలు గంగారెడ్డి, సుభాష్, అనూప్, బక్కన్న, అజయ్, నరేష్‌లు సన్మానించారు.

యువత స్వశక్తితో ముందుకెళ్లాలి

మావల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): యువత స్వశక్తితో ముందుకు వెళ్తూ స్టార్ట్ అప్ బిజినెస్‌లు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లోకల్ స్మార్ట్ డెలివరీ సర్వీసును ఆయన నివాసంలో లాంఛనంగా ప్రారంభించారు. మావలలోని వారి నివాసంలో డెలివరీ సంస్థ నిర్వాహకులు బచ్చన్న వారి మిత్రబృందం సభ్యులతో కలిసి లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకల్ స్మార్ట్ డెలివరీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. మంచి సేవలు అందించి వినియోగదారుల నమ్మకాన్ని చురగొని వ్యాపారంలో రాణించాలని ఆకాంక్షించారు. నాడు ప్రారంభమైన ఎన్నో చిన్నచిన్న స్టార్ట్ అప్‌లు నేడు అత్యంత ఆధారనీయమైన సంస్థలుగా మారాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మావల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, అట్ల గోవర్ధన్ రెడ్డి, రెండ్ల రాజన్న, ఎండీ అఫ్సర్, ఎస్కె రహీం, సమీ ఉల్లాఖాన్, తదితరులు ఉన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

నిర్మిత కేంద్రాలపై.. నిర్లక్ష్యం!



● గృహ నిర్మాణ శాఖ అధికారి కార్యాలయం చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు

● తుప్పుపట్టిన సిమెంట్ ఇటుకల తయారీ యంత్రం

- ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల కోసం కేంద్రాల ఏర్పాటు
- తెలంగాణ రాష్ట్రం వచ్చాక పట్టించుకోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- లబ్ధిదారులకు అందని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- కాలక్రమేనా నిర్మిత కేంద్రాల్లో మాయమైన ఇనుప సామగ్రి
- రోజురోజుకూ తుప్పు పట్టి పోతున్న యంత్రాలు
- అలంకారప్రాయంగా మిగిలిన ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల నిర్మిత కేంద్రాలు
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏజెన్సీ వాసుల ఆశలు

ఉట్నూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రభుత్వ భూములలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన వస్తువుల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు పనికి రాకుండా పోయాయి. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో లక్షలాది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించారు. పేద ప్రజలకు కనీసం నీడ కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికీ ఏ గ్రామంలో చూసిన దర్శనం ఇస్తాయి. కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పూనుకొని పేదలకు సొంత ఇంటి కల సాకారం చేసింది.

అందని డబుల్ బెడ్ ఇళ్లు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక దశాబ్దా కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ గృహాలు ఇప్పటికీ పేదలకు అందుబాటులోకి రాలేదు. మైదాన ప్రాంతాలలో అక్కడక్కడ నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలు లబ్ధిదారులకు ఇచ్చినప్పటికీ.. ఏజెన్సీ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గృహాలు శిథిలదశకు చేరుకుంటున్నాయి. అయినా లబ్ధిదారులను గుర్తించడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. రెండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులను గుర్తించడంలో విఫలమవుతోందంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల కోసం కావాల్సిన వస్తు సామగ్రిని తయారు చేయడానికి ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రాలు అలంకార ప్రాయంగా నిలిచిపోయాయి.



● ఉట్నూర్‌లో పొదల మధ్య నిరుపయోగంగా ఉన్న ఇసుక, సిమెంట్ మిక్సింగ్ యంత్రం

మాయమైపోతున్న ఇనుము?

ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రాల ద్వారా సిమెంట్ ఇటుకలు, తలుపుల ఫ్రేంలు, కిటికీల ఫ్రేంలు, సజ్జలు, పైకప్పు రేకులు, తదితర వస్తు సామగ్రిని తయారు చేయడానికి ఉట్నూర్‌లోని నిర్మిత కేంద్రంలో తెచ్చిపెట్టి నిలువ చేసిన ఇనుము మాయమైనట్లు తెలుస్తుంది. అప్పుడున్న అధికారులు భారీ మొత్తంలో స్టీల్ కొనుగోలు చేయడంతో పాటు ఇసుక గోదావరి నుంచి తెప్పించి నిర్మిత కేంద్రంలో కుప్పలుగా పోయించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ వేసింది. నిర్మిత కేంద్రాలలో తెచ్చిపెట్టిన ఇనుము, ఇసుక, సిమెంట్ గురించి పట్టించుకోక పోవడంతో పాటు గృహ నిర్మాణ శాఖను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అప్పటి

(తరువాయి 4వ పేజీలో....)

నిర్మిత కేంద్రాలను పునరుద్ధరిస్తే బాగుంటుంది

: ఆత్రం సుగుణ, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఉట్నూర్



ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం భారీ మొత్తంలో చేపట్టినందున నిర్మిత కేంద్రాలను పునరుద్ధరిస్తే బాగుంటుంది. బయట మార్కెట్లో సిమెంట్ ఇటుకల ధరలు భారీగా పెరిగినందున సరసమైన ధరలకు ఇందిరమ్మ లబ్ధిదారులకు సిమెంట్ ఇటుకలు, తలుపుల ఫ్రేంలు, కిటికీల ఫ్రేంలు అందిస్తే ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుపొందాలి : ఎంపీ గోడం నగేష్ ● ఇంద్రవెల్లిలో బీజేపీ నాయకుల సమావేశం



ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్



భీంపూర్‌లో యువకులకు బీజేపీ కండువా కప్పుతున్న నాయకులు

ఇంద్రవెల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలిపించుకునేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల బీజేపీ నాయకుల సమావేశంలో ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్‌తో కలిసి బీజేపీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలాగా అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రతి వార్డులు, గ్రామాలు, మండలంలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ పార్టీని స్థానిక ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కేంద్రే బాలాజీ, ఖానాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ ఆరెల్లి రాజలింగం, నాయకులు మెస్రం తుకారం, కోవా రాజేశ్వర్, కనక హనుమంతు, కొరెంగ సుంగు, తదితరులు పాల్గొన్నారు.

● అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

భీంపూర్: బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కష్టపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. ఆయన నాయకులతో కలిసి మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. అందర్‌బంద్, కరంజి(టి) గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటి పెళ్లి రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు అంకం అశోక్, ప్రధాన కార్యదర్శులు గుర్ల నారాయణ, వెంకటేష్, రాకేష్, రమేష్, గంగన్న, భోజన్న, అనిల్, సంజీవ్, సురేష్, అమృత్, సన్నిత్ రెడ్డి, సోమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో అభివాదం చేస్తున్న కంది శ్రీనివాస్ రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోథ్ ఇన్‌చార్జి ఆడె గజేందర్

సర్వే నెం. లేని 245 ఎకరాలకు పట్టాలు ఇప్పిస్తాం

● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి

జైనథ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం సాత్నాల మండలంలోని సలాయితండా, సైద్‌ఊర్, పల్లె తాండ, సాస్‌తండాలకు చెందిన 90మంది బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి కంది పార్టీలోకి ఆహ్వానించారు. వారిలో బీజేపీ నేతలు రాథోడ్ శ్యాంరావ్, రాథోడ్ దూద్‌రావ్, మాజీ సర్పంచ్ జనభాయ్, చౌహాన్ కలరం, జాదవ్‌కిష్టు, రాథోడ్ బీంరావ్, ఆడే దేవిదాస్‌లతో నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే నెం. లేని 245 ఎకరాలకు ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావ్‌తో మాట్లాడి పట్టాలు ఇప్పిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు పలు సంక్షేమ పథకాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోషరావు, బోనగిరి సంటెన్న, కొండ గంగాధర్, పార్టీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డిలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌లో చేరిన కౌటా(బి) నాయకులు

నేరడిగొండ/బోథ్: నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ మండలంలోని కౌట(బి) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జనగే శ్రీధర్, మాజీ ఉపసర్పంచ్ మంగలి రవి, బీఆర్ఎస్ నాయకులు జనిగే పోచన్న, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలో సాధారణంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మండల అధ్యక్షులు ఆడే వసంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటిరాజశేఖర్ రెడ్డి, ఇట్టిడి రాజురెడ్డి, రవీందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రామచందర్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

తాంసి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు వివిధ పార్టీల కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుమారు 36 మంది యువకులు వివిధ పార్టీల నుంచి తమ పార్టీలో చేరినట్లు మండల కన్వీనర్ కౌడాల సంతోష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు కృషి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో మూఢ నమ్మకాలను నిర్మూలించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని డైట్ కళాశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... సమాజంలో మూఢ నమ్మకాలను నియంత్రించేందుకు గాను మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. ఇందులో ఉమాకాంత్, ఊశాన్న, శ్రీధర్ బాబు, నర్సయ్య, లింగారెడ్డి, రాజు, సంతోష్ కుమార్, అమిత్ పాల్గొన్నారు.

వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బోథ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలో వేలాది ఎకరాల్లో సోయాబీన్, పత్తి పంటకు తీవ్ర నష్టం సంభవించిందని, ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల శుభాష్, అధ్యక్షులు మేడిచర్ల ప్రవీణ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులు దిక్కు తోచనిస్థితిలో ఉన్నారని, చేతికి అందే పంట మట్టి పాలు అవుతుందని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సోలంకి సత్యనారాయణ, సీనియర్ పార్టీ నాయకులు దీపిదాస్, కనక అమృతరావు, కేశవరావు, తదితరులున్నారు.



ఉట్నూర్‌లో నివాళులు అర్పిస్తున్న రాజ్ గోండు సేవా సమితి సభ్యులు

ఘనంగా గోండ్వాన మహారాణి జయంతి

ఉట్నూర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుస్సాడిగుట్టరాజ్‌గోండ్ సేవా సమితి భవన్‌లో ఆదివారం గోండ్వానను పరిపాలించిన దుర్గావతి మహారాణి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె ప్రజల సంక్షేమ కోసం కృషి చేశారని రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు అన్నారు. ఇందులో రాజ్‌గోండు సేవా సమితి ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం ప్రకాష్, ఉట్నూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోట్నాక కృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి మడావి బాలాజీ, గౌరవ అధ్యక్షుడు పుర్క గజానంద్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు ఆత్రం వెంకట్, ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఆడ భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

బోజ్జావార్ ఆలయంలో మహా అన్నదానం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొజ్జావార్ మందిరంలో ప్రతిష్టించిన దుర్గాదేవిని ప్రతిష్ఠించి నవరాత్రుల్లో ప్రత్యేక పూజలతో అమ్మవారిని ఆరాధించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిత్యం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధల నడుమ జరిపారు. కాగా ఆదివారం ఆలయంలో మహా అన్నదనం ఏర్పాటు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. కాలనీతో పాటు చుట్టుపక్కల వార్డుల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

'కొలాం గిరిజనుల అభివృద్ధికి నిధులు'

తలమడుగు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కొలాం ఆదివాసీ గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి కోక గణేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నడింపల్లిలో ఆదివాసీ గిరిజనులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న ఆదివాసీల సమస్యలు మారడం లేదన్నారు. వారి అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. త్వరలోనే ప్రభుత్వం వారికి అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. మండలంలో కోలం బ్లాక్ అభివృద్ధి కోసం 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆరె మరాఠా సంఘ నూతన కార్యవర్గం

ఇచ్చోడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ పట్టణంలోని గంగారెడ్డి గార్డెన్‌లో ఆదివారం ఆరె మరాఠా పట్టణ కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు బొస్లె దశరథ్ పాటిల్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఇచ్చోడ పట్టణ అధ్యక్షుడిగా జాదవ్ సాయికిరణ్, ఉపాధ్యక్షులుగా పాన్‌పట్టే సుభాష్, సిందె పరమేశ్వర్, తొరె తానాజీ, బొస్లె అశోక్, సభులుగా దుక్రె శ్యాంసుందర్, కదం చంద్రకాంత్, పాన్‌పట్టే సాయికృష్ణ, లాంగ్డె సాయి, గాడ్గె జ్ఞానేశ్వర్, రాము జాదవ్, గైక్వాడ్ దినేష్, లక్ష్మణ్, అక్షయ్, శివతో పాటు తదితరులను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఆరె మరాఠా సంఘ కార్యవర్గ సభ్యులు